క్లుప్తంగా

123 మంది యువత రక్తదానం

కంచరపాలెం: వైద్యుల దినోత్సవం సందర్భంగా కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్, డెన్టిలిజెంట్ డెంటల్ ల్యాబ్ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, డాక్టర్ పీవీ సుధాకర్‌లు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కరోనా విపత్కాలంలో వైద్యులు ఎంతో మందికి రక్షించారని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని అతిథులు పేర్కొన్నారు. సుమారు 123 మంది యువత రక్తదానం చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆడారి కిషోర్‌కుమార్, డాక్టర్ శివప్రసాద్, గోపికృష్ణ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం



డాక్టర్ శరత్‌రామ్, డాక్టర్ శ్వేతలను సత్కరిస్తున్న శుభ

మురళీనగర్: మురళీనగర్ ఓం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్యుల దినోత్సవంలో భాగంగా ప్రముఖ వైద్యులను సత్కరించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పొందూరు శరత్‌రామ్, పేథాలజీ కన్సల్టెంట్ డాక్టర్ పొందూరు శ్వేతలను డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఓం వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


ఇంటింటా సంక్షేమం



మహిళలకు కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు అన్నారు. 42వ వార్డు మసీదు వీధి, రైల్వే న్యూకాలనీ ప్రాంతాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వార్డు పరిధిలోని 6 క్లస్టర్లలో గల సుమారు 350 గృహాలను ఆయన సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, 237, 236 సచివాలయాల అడ్మిన్‌లు జేసుదాస్, శ్రావణి, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు నాగమణి, ప్రసాదరావు, పార్టీ నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

లలితా పీఠంలో చాతుర్మాస దీక్ష



శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం శంకరాచార్యులు, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఈ నెల 3వ తేదీ ఆషాఢ గురుపౌర్ణమి రోజు నుంచి సెప్టెంబర్ 29 భాద్రపద పౌర్ణమి వరకు చాతుర్మాస దీక్ష చేయనున్నారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. ధర్మ రక్షణ, లోక కల్యాణార్థం లలితా పీఠంలో జరిగే ప్రత్యేక యజ్ఞాలు, పూజలు, వేదపారాయణాల్లో స్వామీజీ పాల్గొని లలితాదేవి అమ్మవారి అనుగ్రహం పొందుతారన్నారు.

గురువందన సమర్పణ..

గురు పూర్ణిమ సందర్భంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి లలితా పీఠంలో గురువందన సమర్పణ జరుగుతుందని పీఠం మేనేజర్ కృష్ణసేస్ తెలిపారు. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాద పద్మాలకు క్షీరాభిషేకం, బిల్వ దళార్చన, స్వర్ణ పుష్ప పూజ జరుగుతాయని, ఈ అభిషేక కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ప్రజల చెంతకే సకల సేవలు

- 'జగనన్న సురక్ష'తో ప్రతి కుటుంబానికీ లబ్ధి
- ప్రజా సేవే పరమావధిగా సీఎం జగన్ పరిపాలన
- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు



లబ్ధిదారుకు సర్టిఫికెట్లు అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో ప్రజల చెంతకే సకలు సేవలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. సీఎం ఆదేశాల మేరకు ఉత్తర నియోజకవర్గంలో నెల రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 14వ వార్డు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ దరి 1086110 సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు కె.కె.రాజు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవే పరమాధిగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగుతోందన్నారు. ప్రజలందరి కోసం శ్రీకారం చుట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందని, 11 రకాల సేవలను పొందవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని 5.3 కోట్ల మందికి చేరువయ్యేందుకు జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారన్నారు. అర్హులై ఉండి పథకాలు, సేవలు అందని వారు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఏపీడీవో దుర్గాప్రసాద్, ఏఈ రహీమ్, జేసీఎస్ మండల కన్వీనర్ మురళీకృష్ణారెడ్డి, కిరణ్‌రాజు, చొక్కాకుల రామకృష్ణ, తులసీ, రాజకుమారి, నీలి రవి, బల్లా శ్రీను, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లు వెంటనే పొందడం చాలా ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఒక బృహత్తర కార్యక్రమం చేపట్టడంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందుతున్నాయి.

– కొత్తపల్లి నిర్మలాకుమారి, 14వ వార్డు

రెండు రోజుల్లో ధ్రువపత్రం



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి లబ్ధి చేకూరుతుంది. గతంలో నెలల తరపడి వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం తిరిగే వారం,. ఇప్పుడు రెండు రోజుల్లోనే కుల ధ్రువీకరణ పత్రం రావడం చాలా సంతోషంగా ఉంది.

– కె.ఈశ్వరమ్మ, స్థానికురాలు

ప్రజలకు ఎంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందించడం గొప్ప విషయం. మా అబ్బాయికి ఆధార్ కార్డుకు పెట్టాం.. వెంటనే వచ్చింది. సీఎం జగన్‌కు మా కృతజ్ఞతలు.

– ఎం.వి.ఎస్.ప్రసాద్, స్థానికుడు

జీవితాన్ని ప్రభావితం చేసేవి కథలు



మాట్లాడుతున్న ద్విభాష్యం రాజేశ్వరరావు

సీతంపేట: సమాజ స్థితిని, గతిని మార్చే శక్తి కథలకు ఉంటుందని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. విశాఖ సాహితి ఆధ్వర్యంలో లలితానగర్ లలితా పీఠంలో శనివారం జరిగిన కథా కచేరిలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరి జీవితాన్ని ఏదో ఒక సందర్భంలో కథలు ప్రభావితం చేస్తాయన్నారు. అటువంటి కథల కోసం విశాఖ సాహితి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 15 మంది రచయితలు వారి స్వీయ కథలను చదివి వినిపించి అలరించారు. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేలా మానవ సంబంధాల మధ్య ఉన్న సున్నితమైన అంశాలను రచయితలు స్పృశించారు. అన్ని కథలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. సభాధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ సాహిత్య ప్రక్రియలో కథకు సముచితమైన స్థానం ఉందని, సామాన్యులను సైతం ఆలోచింపజేసే శక్తి ఒక్క కథలకే ఉందన్నారు. కార్యక్రమంలో విశాఖ సాహితి ఉపాధ్యక్షులు కందాళ కనకమహాలక్ష్మి, డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య పాండురంగ విఠల్, కార్యదర్శి శంకర్ నీలు, పలువురు సాహితీవేత్తలు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ ఆచార్యులకు ఘన సన్మానం



సన్మాన గ్రహీతలతో నేత్ర వైద్యశాల వైద్యులు, సిబ్బంది

సీతంపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలు, డాక్టర్స్ డే సందర్భంగా శనివారం నేత్ర వైద్య విభాగానికి చెందిన పూర్వ ఆచార్యులను ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, ప్రస్తుత నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ ఆచార్యులు, వైద్యులు అహికృష్ణ, ఎం.ఎం.నాయుడు, రాఘవేంద్రరావు, ఎస్.వి.ఎల్.నరసి,హారావు, భాస్కరరావు, టి.జయరాజు, పి.కృష్ణప్రసాద్, వి.వి.ఎల్.నరసింహారావు, సూతర్యనారాయణరాజు, వి.రాజేశ్వరరావు, ఎం.వి.ఎస్.ప్రసాదరావు, ఎ.తారకేశ్వరరావులు సత్కారం పొందారు. కార్యక్రమంలో ఆస్పత్రి నేత్ర వైద్యులు, సిబ్బంది, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

తానా ఉత్తమ గేయకర్త రాంభట్ల



రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట: తానా విశ్వ సాహిత్య వేదిక ఇటీవల నిర్వహించిన 'సిరివెన్నెల సీతారామశాస్త్రి స్మారక గేయ కావ్యాల పోటీలో' విశాఖకు చెందిన రాంభట్ల నృసింహశర్మ రచించిన 'యువావతరణం' ఉత్తమ గేయ కావ్య స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ గేయ కావ్యాన్ని ఈ-బుక్‌గా త్వరలో విడుదల చేయనున్నట్టు తానా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, రచయితలు, కవులు రాంభట్లను అభినందించారు. ఉషాతుషారాలు కవితా సంపుటి, విరిజల్లు పాటల సంపుటితో పాటు దాదాపు నలభై పైచిలుకు గ్రంథాలు వెలవరించిన రాంభట్ల ఉత్తమ గేయ రచయితగా కన్యాశుల్కం టెలిఫిలిం శీర్షిక గీతంతో నంది పురస్కారం అందుకున్నారు. ప్రపంచ తెలుగు భాషా దినోత్సవ గేయ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ వచన రచనా పురస్కారం, కొప్పరపు కవుల కళా పీఠం భారతీ భూషణ బిరుదు సత్కారం రాంభట్లను వరించాయి. విశాఖ ఆకాశవాణిలో సీనియర్ గ్రేడ్ అనౌన్సర్ అయిన రాంభట్ల ఆకాశవాణి వార్షిక పోటీల్లో ఉత్తమ గేయ రచయితగా మూడు సార్లు జాతీయ స్థాయి ప్రథమ బహుమతి గెలుపొందారు. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా దశాబ్ది కాలంగా సేవలందిస్తున్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



51వ వార్డులో అవ్వకు పింఛన్ సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



ఏఎస్సార్ నగర్‌లో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఆదిలక్ష్మి, ధన

మద్రిపాలెం: నియోజకవర్గంలో శనివారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరిగింది. జీవీఎంసీ 51వ వార్డు 289 సచివాలయం పరిధిలోని కన్వీనర్‌గా ఉన్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వలంటీర్లు యశ్వంత్, యమున, భరణి కుమారితో కలిసి అవ్వా తాతలు, వితంతువులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని ఏఎస్సార్ నగర్, సోనియాగాంధీ నగర్, తాటిచెట్లపాలెం, సత్యసాయి నగర్ ప్రాంతాల్లో వలంటీర్లు వేకువజామ నుంచి లబ్ధిదారుల తలుపు తట్టి పింఛన్లు అందజేశారు. 255 సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్, వార్డు మహిళా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి, వలంటీర్ ధన టీచర్ తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

దంతాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంతి

మురళీనగర్: దంతాల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ సిహెచ్.ప్రశాంతి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో శనివారం చిన్నారుల దంతాల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆహార పదార్థాలు తీసుకున్న తర్వాత రాత్రి నిద్రించడానికి ముందుగా దంతాలు బ్రష్‌తో చేసుకోవాలన్నారు. దంత సమస్యలపై డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్టెప్పింగ్ స్టోన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, వినీల, పూజ, లక్ష్మి, సౌజన్య అధ్యాపక బృందం పాల్గొని సహకరించారు.

నేటి నుంచి రాయితీపై టమాటా విక్రయాలు

సీతమ్మధార: వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ శనివారం సీతమ్మధార రైతుబజార్‌ను సందర్శించారు. కూరగాయల స్టాళ్లు, రైతుల ఐడీ కార్డులను పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి రాయితీపై కిలో టమాటా రూ.50కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ లేదా రేషన్ కార్డు వినియోగదారులు వెంట తీసుకురావాలన్నారు. సీతమ్మధార రైతుబజార్‌లో నాలుగు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి పార్కింగ్ సమస్యపై దృష్టి సారిస్తామన్నారు. యాసిన్ వెంట రైతుబజార్ ఈవో పి.కొండబాబు ఉన్నారు.

ఘనంగా స్వాతి ప్రమోటర్స్ వార్షికోత్సవం



చైర్మన్ కృష్ణారెడ్డికి కేక్ తినిపిస్తున్న రమేష్‌రెడ్డి

సీతమ్మధార: స్వాతి ప్రమోటర్స్ సంస్థ 17వ వార్షికోత్సవం, చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ ఎండీ రమేష్‌రెడ్డి కేక్ కట్‌చేసి చైర్మన్ కృష్ణారెడ్డికి తినిపించారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, డైరెక్టర్ జి.రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎస్ఎన్ రాజు, డీజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం

సీతమ్మధార: పౌర ప్రజా సంఘాల వేదిక సమన్వయకర్త పి.చంద్రశేఖర్, భారత్ బచావో జిల్లా ప్రధాన కార్యదర్శి డా.పొన్నాడ శ్రీనివాస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చర్చా గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ స్వతంత్ర జర్నలిస్టు తులసి చందును హత్య చేస్తామని బెదిరింపులు, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ అజాద్‌పై కాల్పుల దాడి, ప్రజా ఉద్యమకారులపై ఉపా చట్టం పేరుతో చేస్తున్న దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రస్తుత పాలకవర్గం బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశంలో రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఫాసిజాన్ని ఓడిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' అని పిలుపునిచ్చారు.

పీవోడబ్ల్యూ ప్రతినిధి లక్ష్మి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను అణచివేసేందుకు స్వదేశీ, విదేశీ జర్నలిస్టులను సైతం సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలంతో దూషించడం, హత్యలకు పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు ఆర్‌కేవీఎస్ కుమార్, ఐద్వా నాయకులు ప్రియాంక, క్షేత్రపాల్, వెంకటేశ్వర్లు, అభిలాష్, చిన్నారావు, విమల, ఎ.భేగం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



నరసింహనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నరసింహనగర్‌లోని అన్ని వీధుల్లో బీటీ రోడ్లు, అంతర్గత రోడ్లు, మార్జిన్స్, గణేష్‌నగర్‌లోని పలు సచివాలయాల పరిధిలో సీసీ డ్రెయిన్లు, అంతర్గత రోడ్లు, వాసుదేవనగర్‌లో బీటీ రోడ్లకు మొత్తం రూ.3.29 కోట్లు నిధులు మంజూరు కాగా.. ఈ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రజలకు ఆటంకం లేకుండా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, జి.హరిపట్నాయక్, రాజు యాదవ్, బాబూరావు, నేపాల్ శ్రీను, నాయుడు, ఆదిలక్ష్మి, నూకరత్నం, సీవోలు, ఆర్పీలు, జీవీఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ భరణి, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ కార్డు అందజేత



వెరోనికకు హెల్త్ కార్డు అందజేస్తున్న కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు, సర్టిఫికెట్లు ఇంటి వద్దే పొందవచ్చని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు అన్నారు. 44వ వార్డులో జగనన్న సురక్షకు అర్హులైన లబ్ధిదారుల కోసం గత వారం ఇంటింటా సర్వే నిర్వహించారు. 245 సచివాలయం పరిధి శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న వెరోనిక థెరిసా అనే ఆంగ్లో ఇండియన్.. తల్లి రేషన్‌కార్డులో ఉండటం వల్ల ఆమె పింఛన్ తీసుకోవడం వల్ల వెరోనికకు ఏ పథకం వర్తించడం లేదని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకొచ్చారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా ఆమె అభ్యర్థించారని తెలిపారు. దీంతో తల్లి రేషన్ కార్డు నుంచి ఆమెను వేరు చేసి ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పిస్తూ ఎలిజిబిలిటీ ధ్రువపత్రం, హెల్త్ కార్డును శనివారం ఉదయం బాణాల శ్రీనివాసరావు వెరోనికకు అందజేశారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వానికి రుణ పడి ఉంటానన్నారు.

ఆర్‌ఎంపీల సేవలు మరువలేనివి



వైద్యుల దినోత్సవంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తదితరులు

సీతంపేట: ఆర్‌ఎంపీ సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆర్‌ఎంపీ వైద్యుల సేవలు మరువలేనివన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు అందిస్తున్న సేవలు మెరుగుపర్చుకుంటే బాగుంటుందన్నారు. కేజీహెచ్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు సేవలు ఎప్పటి నుంచో ఉంటున్నాయన్నారు. డాక్టర్ మురళీకృష్ణ క్యాన్సర్ గురించి ఆర్‌ఎంపీలకు అవగాహన కల్పించారు. రూ.2కే పేదలకు వైద్యం అందిస్తున్న విజయనగరం జిల్లా గరివిడికి చెందిన డాక్టర్ ఎ.ఎన్.ఆనంద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, కార్యదర్శి ఎన్.సుగుణేశ్వరి, గౌరవ సలహాదారు డాక్టర్ ఎల్.ఎస్.రావు, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల శ్రీనివాసరావు, కె.ఎస్.రావు, న్యూరోసైక్రాటిస్ట్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సదస్సు నేడు



మాట్లాడుతున్న పప్పల రామ్మోహన్

మద్రిపాలెం: ఈ నెల 2న నిర్వహించే బీసీ సదస్సును విజయవంతం చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్ పిలుపునిచ్చారు. 51వ వార్డు మాధవధార వుడా కాలనీలోని కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ సదస్సు నిర్వహిస్తాయని తెలిపారు. దేశ జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఉద్యోగాలు, అధికారం, సంపదలో ఆ స్థాయి భాగస్వామ్యం లభించడం లేదన్నారు. వారి అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈ సదస్సులో సమగ్రమైన చర్చ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి ఏబీసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు, బీసీ హక్కుల ఉద్యమ నేత, రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య, అనేక మంది జాతీయ నాయకులు, రాష్ట్రంలోని 132 వెనుకబడిన కులాల నాయకులు హాజరవుతారన్నారు. సమావేశంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏబీసీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనం అవసరం



బహుమతులు పొందిన విద్యార్థులతో సత్తి సునీల్‌రెడ్డి

మురళీనగర్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కేంద్ర సీఐడీ సంస్థ రిటైర్డ్ ఎస్పీ సత్తి సునీల్‌రెడ్డి అన్నారు. మురళీనగర్ ఎంఎస్ఎన్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు శనివారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర అధ్యయనం ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చని, ఉన్నత విద్యాభ్యాసం అనంతరం ఉద్యోగాలు పొందాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. వివిధ అంశాలపై ఉత్తమ జవాబులు చెప్పిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్ఎన్ మూర్తి పర్యవేక్షించారు.

బీపీడీఎంఎంఎస్ సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రభారి అన్నాజీ దుమాల్

కంచరపాలెం: భారతీయ పోర్ట్-డాక్ మజ్దూర్ మహాసంఘ్(బీపీడీఎంఎంఎస్) రెండు రోజుల సర్వసభ్య సమావేశం శనివారం 104 ఏరియాలోని బీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. మహాసంఘ్ అధ్యక్షుడు ప్రదీప్‌బిజిలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు బీఎంఎస్ ప్రభారి అన్నాజీ దుమాల్, సహ ప్రభారి చావ్లాజీ, ప్రధాన కార్యదర్శి సురేష్ పాటిల్ మాట్లాడారు. దేశంలోని అన్ని పోర్టుల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించి వాటికి తగిన పరిష్కారాలను ప్రతిపాదించి, తీర్మాలను ఆమోదించి పోర్టు యాజమాన్యాలకు, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అఖిల భారత ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరావు మాట్లాడుతూ గత కొన్నేళ్లగా అనేక పోర్టుల్లో జరిగిన సంఘటనలను బీఎంఎస్ సాధించిన విజయాలను విశదీకరించారు. కార్యక్రమంలో ఎంవీఎస్ నాయుడు, లాలం ప్రసాద్, సురేష్‌కుమార్, రామచంద్ర శేఖర్, భవానీ శంకరుడు, రవిశంకర్, గోపి పట్నాయక్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.